క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు హౌజ్‌వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రవి తెలిపారు. వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, మలుగు, జనగాం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు శిక్షణకు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు కలిగి, తెలుపు రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 15 లోపు సంస్కృతి విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు 9704056322కు ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

హన్మకొండ : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని అప్పుడే ఉన్నత చదువులు, ఉద్యోగాల సాధనలో ముందు వరుసలో ఉంటారని కాకతీయ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మేఘనరావు సూచించారు. హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్ ముదిరి నాగరాజు రాసిన 'హైస్కూల్ ఇంగ్లిష్ గ్రామర్' పుస్తకాన్ని మంగళవారం ఆమె హాజరై ఆవిష్కరించారు. స్కూల్ ఆవరణలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ ఎంఈఓ శ్రీరామ్ కిషన్‌రాజు, పీటీసీ ఇన్స్‌పెక్టర్ బానోతు కాశీరాం, కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్: దూపకుంట రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ నాగేశ్వరరావుకు సీపీఎం పార్టీ నేతలతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఆనంతరం రత్నమాల మాట్లాడుతూ పడమరకోటలో రోడ్డు వెడల్పులో 500 మంది ఇళ్లు కోల్పోయిన బాధితులకు అప్పటి మంత్రి బస్వరాజు సారయ్య ఇళ్ల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. పట్టాలు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మైదం రత్నం, భాస్కర్, ప్రసాద్, ఎలిషమ్మ, సుజనా, సుకన్య, ప్రేమానందం పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

కరీమాబాద్ : నిలువ నీడలేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చి అద్దె ఇళ్లలో కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. నాయకులు గాదె రజిత, రాములు, అనసూర్య, సోను, సోనీ, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రాజుకు సన్మానం

ఖిలా వరంగల్: మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రీ జయంతి సందర్భంగా ఖిలావరంగల్ పడమరకోటలో మంగళవారం లయన్స్ క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపికైన ఉత్తమ వైద్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్ట్రిక్ గవర్నర్ వెంకటేశ్వర్లు, ప్రతినిధులు శ్రీనివాస్, జారతి సత్యనాథ్ హాజరై ఫోర్ట్ రోడ్డు ఏకశిలనగర్‌కు చెందిన డాక్టర్ మైదం రాజుకు మెమోంటోను అందజేసి శాలువాతో సన్మానించారు. ఏకశిలనగర్ కా లనీకి చెందిన ప్రతినిధులు డాక్టర్ మైదం రాజును కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో ఎంపికై ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో 9, 10, ఇంటర్ మొదటి, సెకండియర్ చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందుటకు ఫ్రెష్, రెన్యువల్ చేసుకునేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నవంబర్ 30 లోగా రిజిస్టర్ చేసుకోవాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్కీం రెసిడెన్షియల్ పాఠశాలు, కళాశాల విద్యార్థులకు వర్తించదని ఆమె పేర్కొన్నారు.

టీ- హబ్‌ను సందర్శించిన మాంటిస్సోరి విద్యార్థులు



హసన్‌పర్తి: మండలంలోని ఎల్లాపురం శివారులోని మాంటీస్సోరి ప్రైమ్ స్కూల్ విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లో నెలకొల్పిన టీ-హబ్‌ను సందర్శించారు. పాఠశాల చైర్మన్ జోస్ నెడుంతుండమ్, అధ్యక్షుడు గండ్ర సుధాకర్‌రెడ్డి, పిన్సిపాల్ జోస్, డైరెక్టర్ శ్రీనివాస్, బైజువర్గీస్ ,వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. టీ-హబ్‌లోని నూతన ఆవిష్కరణలను సందర్శిస్తూ, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సంబంధిత సాంకేతిక విషయాలను నిపుణుల ద్వారా తెలుసుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- మహిళా సాధికారతకు బీఆర్‌ఎస్ పెద్దపీట
- ఎమ్మెల్యే రమేష్
- రూ.6.90 కోట్ల పనులు ప్రారంభం



వరంగల్ : 3వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రమేష్

వరంగల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఎన్నడూ లేని విధంగా డివిజన్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గ్రేటర్‌లోని 3వ డివిజన్ పరిధి ఆరెపల్లి, కొత్తపేట, పైడిపల్లి గ్రామాల్లో రూ.6.90 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆరెపల్లిలోని వజ్ర గార్డెన్స్‌లో జరిగిన మహిళా సంఘాల వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికే విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్‌కు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షురాలు లలితా యాదవ్, స్థానిక కార్పొరేటర్ షిభారాణి, అనిల్‌కుమార్, ప్రజా ప్రతి నిధులు, మహిళా సంఘాల నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. గ్రేటర్ పరిధిలోని 44వ డివిజన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెవ్వ శివరామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని తెలిపారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ, 44 డివిజన్ అధ్యక్షుడు దోపతి జయపాల్‌రెడ్డి, దర్గా పీఏసీఎస్ చైర్మన్ వనంరెడ్డి, కాజీపేట రైతుబంధు కోఆర్డినేటర్ కంకణాల సంపత్‌రెడ్డి, విక్టర్, సదానందం, రాములు, స్పందన్, జోగిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నాయుడు పెట్రోల్‌పంపు నుంచి డప్పుచప్పుళ్లతో తిమ్మాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఐలమ్మ విగ్రహం అపహరణపై ఆందోళన



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న ఏసీపీ

కాజీపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అపహరించిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రజక సంఘం నాయకులు ఆందోళన నిర్వహించారు. 61వ డివిజన్ ఫాతిమానగర్ చౌరస్తా ప్రధాన రహదారిపై సంఘం నాయకులు మంగళవారం బైఠాయించి రాస్తారోకో చేయడంతో దాదాపు అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. తొలగించిన విగ్రహాన్ని వెంటనే యథాస్థానంలో ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తూ భారీగా తరలివచ్చిన రజకులు ఆందోళన దిగడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వాహనాలు ఆగిపోవడంతో ఏసీపీ డేవిడ్‌రాజ్, సిఐ సార్ల రాజులు పలు దఫాలుగా ఆందోళనకారులతో చర్చలు జరిపారు. విగ్రహం ఏర్పాటుకు తగు చర్యలు చేపడతామని చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, పాలడుగుల శివకుమార్, నాగెల్లి సమ్మయ్య, అనిల్ కుమార్, పోన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ విద్యార్థుల ప్రతిభ



ఎంజీఎం : ఇటీవల ఉస్మానియా మెడికల్ కాలేజీలో నిర్వహించిన యూజీ కాన్ఫరెన్స్‌లో కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అవార్డులు గెలుచుకున్నారు. మూర్చ, భూత వైద్యం అంశంపై శశాంక్, రోహిత్ సింగరాజు, షమ్మాస్, వసీం, తాన్య, రాశి, అఖిల్, ఆరుష్ సింపోజియం సమర్పించారు. ఈ బృందం రెండు దశల ఎంపికల్లో ఉత్తీర్ణత సాధించి జాతీయస్థాయి సదస్సులో ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ ఫైనల్స్‌లో ఉత్తమ పరిశోధనకు అవార్డు దక్కించుకున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ తెలిపారు. మెడికల్ డిబేట్‌లో రోహిత్ సింగరాజు, శశాంక్ ప్రథమ స్థానం సాధించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో రెండవ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మోహన్‌దాస్ మంగళవారం కళాశాల చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

దసరా వేడుకలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌బాబు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించే దసరా వేడుకలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు అన్నారు. కరీమాబాద్ నేతాజీ ఆదర్శ ట్రస్ట్ భవన్‌లో మంగళవారం కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వర్షం కురిసినప్పటికీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చొరవ తీసుకుని వేడుకలు విజయవంతమయ్యేలా చేశారన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా లాంటి ఉత్సవాలు జరుపుకునే రంగలీలా మైదానంను భూకబ్జాదారుల నుంచి కాపాడి వేడుకలు జరుపుకునేందుకు సహకరించిన నగర పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌లకు కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సభ్యులు కృషి చేయాలని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వొడ్నాల నరేందర్, వంగరి కోటేశ్వర్,శివమూర్తి, రాంప్రసాద్, రంజిత్, అనిల్‌కుమార్, సందీప్, వెంకటేశ్వర్లు, వాసు, అజయ్, అశోక్, రాజు, మహేష్, శ్రీను, గోవర్ధన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో జనసేన పోటీ

ఖిలా వరంగల్ : వరంగల్ తూర్పు నియోజవర్గంలో జనసేన పార్టీ పోటీ చేయనుందని ఆ పార్టీ తూర్పు కన్వీనర్ తాళ్లపెల్లి బాలుగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బోంగునూరి మహేందర్‌రెడ్డి 32 స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించడం సంతోషకరమన్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తే జెండా ఎగరవేయడం ఖాయమని బాలుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

వార్డెన్, హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

హన్మకొండ: సహచర విద్యార్థులు వేధిస్తున్నారని తెలిసినా కనీస చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్, హెచ్‌ఎంలను సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్, ఏబీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని కుడా రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీ భూక్యా నిహారికను మంగళవారం పరామర్శించారు. వారిద్దరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆశిష్ మిశ్రాను వెంటనే అరెస్ట్ చేయాలి

వరంగల్ చౌరస్తా : రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని బలప్రదర్శన చేస్తున్న రైతులపై దాడి చేసి హత్య చేసిన కేంద్ర హోం శాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, జిల్లా బాధ్యులు బాబు, శంకరయ్య, బాలరాజు, శ్రీనివాస్, హంసారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని రెనాల్ట్స్ పాఠశాల విద్యార్థులు స్పేస్ హోటల్, స్పేస్ కాలనీ ప్రాజెక్టు చేసి నాసాకు పంపించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన నాసా వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ శ్రీధర్ విద్యార్థులకు నాసా సర్టిఫికెట్లు అందజేసి అభినందించా రు.

స్వచ్ఛతా హీ సేవాతో చిల్డ్రన్స్ పార్క్ క్లీన్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సమీపంని కాకతీయ చిల్డ్రన్స్ పార్క్‌ను స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంతో క్లీన్ చేసినట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. కొంత కాలం నుంచి చెట్లు, చెత్తతో నిండి ఉండి నిరుపయోగంగా భయంకరంగా మారిన చిల్డ్రన్స్ పార్క్‌ను రైల్వే అధికారులు అక్టోబర్ 1న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టి క్లీన్ చేశారు. చిల్డ్రన్స్ పార్క్‌ను క్లీన్ చేయక ముందు ఫొటోను, చిల్డ్రన్స్ పార్క్‌ను క్లీన్ చేసిన తర్వాత ఫొటోను జీపీఎస్ ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ ఇంటివేట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత అప్రిషేషన్ సర్టిఫికెట్‌ను రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణ సాయికి పంపించినట్లు అధికారులు తెలిపారు.

విధులు బహిష్కరించి నిరసన

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు లెక్చరర్లు కొందరు విధులు బహిష్కరించి తమ నిరసన తెలిపారు. పరిపాలనాభవనం ఎదురుగా రోడ్డుపై ధర్నా చేశారు.ఆల్ యూనివర్సిటీస్ కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, బాధ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రాస్తారోకో

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ కను కయ్య మాట్లాడు తూ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులని రెగ్యులరైజ్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

కాజీపేట అర్బన్ : 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పీఆర్‌సీని స్వాగతిస్తున్నామని, 5 శాతం పీఆర్‌ను ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

ఖిలా వరంగల్: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం, సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఒకరోజు సమ్మె చేయనున్నట్లు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం వరంగల్ డివిజన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల సాధన కోసం డివిజన్ కార్యాలయం, హెడ్‌పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

పైపుల వల్లే పనుల్లో జాప్యం

హసన్‌పర్తి: కల్వర్ట్ కింద మిషన్ భగీరథ పైపులు ఉన్నందున పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గుండ్లసింగారం-ముచ్చర్ల మార్గ మధ్యలోని మిలీనియం స్కూల్ సమీపంలోని కల్వర్ట్ దెబ్బతిన్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మంగళవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ గౌస్, ఏఈ జయశ్రీలు దెబ్బతిన్న కల్వర్ట్‌ను పరిశీలించారు.ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల గురించి స్థానికులు వివరించారు. అనంతరం అధికారులు మాట్లాడు తూ ఇక్కడ వంతెన నిర్మాణానికి నిధులు మంజూ రయ్యాయని తెలిపారు. మిషన్ భగిరథపైప్‌లు మార్చితే తప్ప పనులు ప్రారంభం కావన్నారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులకు కూడ లేఖ రాసినట్లు చెప్పారు. పరిశీలించిన వారిలో వెంకటేశ్వర్‌రెడ్డి, కమార్ యాదవ్, చిర్ర శ్రవణ్, మట్టెడ అనిల్, సుమన్, బొక్క బిక్షపతి, సాంబయ్య, తదితరులు ఉన్నారు.

అరూరిపై ఆగ్రహ జ్వాల

- సంక్షేమ పథకాలు మాకెందుకులేవని నిలదీత
- దమ్మన్నపేటలో ప్రజల ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి
- ఇప్పటికే ఎమ్మెల్యే చల్లాకు నిరసన సెగలు
- వర్ధన్నపేట, పరకాల బీఆర్‌ఎస్‌కు కంచుకోట
- ఊహించని పరిణామాలతో పార్టీలో అంతర్మథనం
- ఇద్దరు గెలిచేందుకు ఎదురీత తప్పదంటున్న విశ్లేషకులు



నిరసన తెలుపుతున్న ప్రజలు

సాక్షి, వరంగల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ నియోజకవర్గాలకు వెళ్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు నిరసన సెగలు తగులుతున్నాయి. సంక్షేమ పథకాలు మాకు ఎందుకు ఇవ్వడంలేదని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని పరకాల నియోజకవర్గంలోని ప్రజలు ఇటీవల నిలదీశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు మంగళవారం ఆ అనుభవం ఎదురైంది. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం వెళ్లిన ఆయనను ప్రజలు అడ్డుకున్నారు. 'దళిత బంధుకు అర్హత ఉన్న వాళ్లను కాకుండా వారి అనుయాయులకు ఇచ్చుకున్నారు. గృహలక్ష్మి పథకానికి కూడా అర్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఎమ్మెల్యే ఫైనల్ చేసిన జాబితా వారికే ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి తాజాగా మళ్లీ ఇతరులకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని' ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. అప్పటికే బందోబస్తు ఉన్న పోలీసుల సాయంతో ఆ గ్రామంలోకి వెళ్లి అభివృద్ధి పనులు ప్రారంభించి అరూరి రమేష్ వెళ్లిపోయారు.

ఇన్నిరోజులు పార్టీ నేతలు.. ఇప్పుడు ప్రజలు

నియోజకవర్గంలో ఇన్ని రోజులు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై బీఆర్‌ఎస్‌లోని ముఖ్య నేతలే అసంతృప్తి వెళ్లగక్కారు. ఆయనకు టికెట్ ఇస్తే పనిచేయమనే వరకు వెళ్లారు. అరూరి వద్ద పార్టీ నేతలకు అసలు గౌరవం లేదని, అలాంటి వ్యక్తికి మేం ఎలా మద్దతిస్తామని ఓ పది రోజుల పాటు ముఖ్యనేతల వద్ద సమావేశాలు కూడా జరిగాయి. చివరకు బీఆర్‌ఎస్ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాలతో అసమ్మతి సమసిపోయింది.. పరిస్థితి అంతా చక్కదిద్దుకుందన్న తరుణంలో ఎవరు ఊహించని రీతిలో అరూరికి ప్రజల నుంచి నిరసన సెగ తగలడం పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇప్పటికే గుబ్బెడ తండా, చెన్నారంలో ప్రజల నుంచి నిరసనలు వచ్చాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళితబంధు, గృహలక్ష్మి తదితర పథకాలు తమకు ఎందుకు రావడం లేదని దమ్మన్నపేట గ్రామస్తులు అడిగే ప్రశ్నలకు సమాధానం కరువవుతోంది. ఈసారి లక్ష మెజారిటీతో గెలవడం పక్కా అనుకున్నా ఈ స్థానంలో ప్రజల నుంచి ఊహించని వ్యతిరేకత రావడం పెరగడం వర్ధన్నపేట నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని ఆ నియోజకవర్గ ముఖ్యనేత వ్యాఖ్యానించారు. అరూరికి ఎదురు లేదని అనుకుంటున్నాడు కానీ తప్పక ఎదురీత ఈదాల్సిన పరిస్థితి ఉందని పేరు చెప్పడానికి ఇష్టపడని నేత తెలిపారు. ఓవైపు పార్టీలో అంతర్గత పోరు, ఇంకోవైపు ప్రజల నిరసన సెగ.. వీటి నుంచి అరూరి తప్పించుకుని ఎలా బయటపడుతాడోనని ఆయన అభిమానుల్లో ఆందోళన మొదలైందని నియోజకవర్గంలో భారీగా చర్చ జరుగుతోంది. అలాగే, పరకాలలో వార్ వన్ సైడ్ ఉందనుకుంటే అక్కడ కూడా ప్రజల నుంచి నిరసనలు రావడం ఎమ్మెల్యే చల్లాకు నిద్ర పట్టనివ్వడం లేదని ఆ పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు.

మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

నయీంనగర్ : మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం నగరంలోని 6వ డివిజన్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మైనార్టీ బంధు పథకాన్ని ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వం మైనారిటీలను ఓట్ల కోసం మాత్రమే వాడుకున్నారని, భారతదేశాన్ని ఎక్కువ కాలం పాలించినటువంటి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. మైనారిటీ కుటుంబాలతో తనకు ఎన్నో ఏళ్లుగా సంబంధం ఉందని, అలా నా ప్రతి విజయంలో వారి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతేయాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ముస్లిం మత పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై సమీక్ష



మేనేజర్లతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్

కరీమాబాద్ : వరంగల్ జిల్లాలోని హెచ్‌బీసీ, బీపీసీ, ఐఓసీల సేల్స్ మేనేజర్లతో మంగళవారం జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. రోజు వారీగా, నెల వారీగా అమ్మకాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో సంబంధిత లైసెన్స్, స్టాక్, ధరల పట్టిక, నో స్మోకింగ్ సైన్ బోర్డులు, ఎంట్రీ, ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బంకులకు వచ్చే వినియోగదారులకు తాగునీరు, టాయిలెట్స్, ఎయిర్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం బృందావన్ కాలనీ 7/బీ కాకతీయ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొజ్జ సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా బైకాని లక్ష్మణ్, కోశాధికారిగా తడాలపల్లి శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు బిల్లా రఘునాథ్‌రెడ్డి, కాలనీవాసులు ఏకాంబరం, సుమన్, సత్యప్రకాష్, రాజ్‌కుమార్, మోహన్, అనంతారెడ్డి, క్రాంతి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఒంటికాలుపై నిరసన తెలుపుతున్న భోజన కార్మికులు

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు డీఈఓ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటికాలుపై నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎదురు పెట్టుబడి పెట్టి పిల్లలకు కడుపునిండా భోజనం పెడుతున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని రోడ్డుపై నెట్టివేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.రజిత, పద్మ, శాంత, సంధ్య, లక్ష్మి, అరుంధతి, ప్రేమలత, అరుణ, సరోజ, హైమా, సుల్తానా, శారద, రమ, శ్రీవాణి, పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన సమ్మె

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 14 రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు వినూత్న పద్ధతుల్లో నిరసన తెలుపుతున్నారు. సమ్మెలో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని నిరసన శిబిరం వద్ద మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

భవిష్యత్‌కు భరోసా ఐఐటీ జామ్

కేయూ క్యాంపస్: దేశంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదవడం కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులను ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబర్ 13తో ముగుస్తుంది. ఇంటర్మీడియట్ ద్వారా ఐఐటీలో చదవాలన్న ఆశయం నెరవేరకపోతే డిగ్రీ ద్వారా ఐఐటీలో చదవడానికి విద్యార్థులకు మరొక అవకాశం జామ్. దీనిపై విద్యార్థుల్లో అవగాహన లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో జామ్ ఎంట్రెన్స్ రాసే విద్యార్థుల సంఖ్య బాగా తక్కువగా ఉంది. అక్టోబర్ 5న ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జామ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ మద్రాస్ ఆచార్యులు బీరయ్య రానున్నట్లు గణిత విభాగ ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ అంజన్‌రావు తెలిపారు.